## నాల్గవ ఆంధ్ర సాంస్కృతికోత్సవానికి సిద్ధమౌతున్న సిలికానాంధ్ర

మొన్ననే మూడవ పుట్టినరోజు పండుగ జరుపుకున్న సిలికానాంధ్ర నాల్గవ ఆంధ్ర సాంస్కృతికోత్సవాన్ని భారీగా నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. 2001 డిసెంబర్ లో మొదటిసారి, 2001 అక్టోబర్ లో రెండవసారి, 2003 అక్టోబర్ లో మూడవ సారి ఆంధ్రసాంస్కృతికోత్సవాల్ని దిగ్విజయంగా నిర్వహించిన సిలికానాంధ్ర ఈ సారి కూడా సరికొత్త కార్యక్రమాలతో సిలికాన్ వేలీ లోని ఆంధ్రుల్ని అలరించడానికి సిద్ధమౌతోంది. ఈ వెబ్సైట్ లోని EVENTS విభాగంలో ఉన్న క్రిందటి ఆంధ్రసాంస్కృతికోత్సవ విశేషాల్ని, చిత్రాల్ని పరిశీలిస్తే ఒకదానికొకటి ఎంత వైవిధ్యంగా జనరంజకంగా తీర్చిదిద్దబడ్డాయో అవగతమౌతుంది. ఈ సారికూడా మరిన్ని వినూత్న కార్యక్రమాలతో మీ ముందుకి రాబోతున్న ఆంధ్ర సాంస్కృతికోత్సవంలో 'సిలికాన పల్లె తిరణాల' ప్రత్యేక ఆకర్షణ! సాయంకాలం భోజన సమయంలో మూడు గంటలపాటు జరిగే తిరణాలలో పూర్తి తెలుగు పల్లెటూరి వాతావరణన్ని సృష్టించబోతున్నారు మన కార్యకర్తలు. మధ్యాహ్నం 1.00 నుంచీ 4.00 వరకూ జరిగే ప్రధమ భాగంలో కర్ణాటక సంగీత వాయిద్యాల పై జానపద గీతాలు, భేతాళ కధలు, పిల్లల నీతి చంద్రిక, ఆంధ్ర వైభవం కూచిపూడి నృత్య రూపకం ఉంటాయి. రాత్రి 7.00 నుంచీ 10.00 వరకూ జరిగే ద్వితీయార్ధంలో 'తెలుగు జీవన మాధుర్యం' అనే సంగీత, సాహిత్య, నృత్య, నాటక రూపకాన్ని 'బ్రాడ్వే' షో స్థాయిలో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. హాస్యావధాని శ్రీ శంకరనారాయణ గారు, ప్రముఖ గాయని మాల్గాడి శుభ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు..



ఇంత భారీ ఎత్తున జరగబోయే ఈ కార్యక్రమానికి ప్రణాళికను రూపొందించే 'నాందీ ఉత్సవం' అగస్ట్ 14 సాయంకాలం మిల్పిటాస్ లోని ఐ.సి.సి.సి. లో జరిగింది. ఈ సందర్భంగా హాజరైన క్రియాశీలక కార్యకర్తల్ని ఉద్దేశించి మాట్లాడుతూ అధ్యక్షుడు శ్రీ దిలీప్ సిలికానాంధ్ర పాటిస్తున్న విలువలగురించీ, ప్రపంచవ్యాప్తంగా మనకున్న గుర్తింపు గురించీ చెప్పారు.



స్థాపక అధ్యక్షుడు శ్రీ ఆనంద్ రాబోయే కార్యక్రమ విశేషాల్ని తెలియచేశారు. ఈ భారీ కార్యక్రమానికి 'ప్రోగ్రాం మేనేజర్' గా డాక్టర్ గుండ్లాపల్లి రవి శంకర్. చైర్మన్ గా శ్రీ కూచిభొట్ల రవి ఎంపిక అయ్యారు. మరికొన్ని కమిటీలని కూడా ప్రకటించారు. ఫండ్ రైజింగ్ అధ్యక్షుడిగా శ్రీ గోపిరెడ్డి గారు

నియమితులయ్యారు. కొంతమంది కార్యకర్తలు సిలికానాంధ్ర లో తమ అనుభవాల్ని వివరిస్తూ సంస్థకి తమ సేవలు ఎప్పటికీ ఉంటాయని పునరుద్ఘాటించారు. ఆ నాటి సమావేశంనుంచీ కొన్ని ముఖ్య సన్నివేశాలు..













*****

## *తెరవెనుక కథ*

*మొన్న అగస్ట్ 7 న జరిగిన ఆంధ్ర నాటకోత్సవంలో ఒక భాగంగా*

*ప్రదర్శించబడిన శ్రీకృష్ణ రాయబారం నాటకం వెనుకనున్న ఆసక్తి కరమైన కథ*

జులై 23..శుక్రవారం..ఉదయం 7.00 గంటలు. అప్పాజోస్యుల వారి వద్దనుంచీ రావాల్సిన ఫోను ఇంకా రాలేదు. సిలికానాంధ్ర స్థాపక అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్, ప్రస్తుత అధ్యక్షుడు కొండిపర్తి దిలీప్ ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. ఇంక ఆగలేక అప్పాజోస్యుల వారికి ఫోన్ చేశారు..ఊహించని వార్త..ఇండియా నుంచీ రావలసిన 20 మంది కళాకారులకి వీసాలు తిరస్కరించబడ్డాయి. అప్పటి వరకూ చేస్తున్న ప్రచారం ప్రకారం ఇండియా నుంచీ రావలసిన

మీగడ రామలింగస్వామి మరియూ వై.కె.నాగేశ్వర రావు గార్ల బృందాలతో 'గుణనిధి' , 'స్వామి వివేకానంద' నాటకాలు అగస్ట్ 7 వ తేదీన సిలికానాంధ్ర మూడవ వార్షికోత్సవం సందర్భంగా ప్రదర్శించ వలసి ఉంది. క్రిందటి సంవత్సరం నుంచే తమ వార్షికోత్సవాన్ని 'ఆంధ్ర నాటకోత్సవం' గా జరుపుకుంటున్న సిలికానాంధ్ర క్రిందటి సంవత్సరం ఆకెళ్ళ బృందం ప్రదర్శించిన 'శ్రీనాథుడు' పద్యనాటకాన్ని ఏర్పాటు చేసిన సంగతి చాలమందికి గుర్తుండే ఉంటుంది. ఐతే ఈ సారి వీసా సమస్యలు అడ్డు వచ్చాయి. కార్యక్రమం ఇంకా పట్టుమని రెండు వారాలు కూడా లేదు..ఏం చేయాలి..? అప్పటికే పబ్లిసిటీ భారీ ఎత్తున జరుగుతోంది. టిక్కెట్లు కూడా అమ్ముడు బోయాయి. ఈ సమయంలో మళ్ళీ అంత భారీ కార్యక్రమం ఏర్పాటు చేయడం , అందునా కేవలం రెండు వారాల వ్యవధిలో..? ఎంతటి వారికైనా ఒక్క క్షణం సంకోచం రావడం అతి సహజం.. ఐతే కలలు కనడం, కలల్ని నిజం చేసే మార్గంలో పట్టుదలతో పనిచేయడం అనేవి మొదటి నుంచీ సంప్రదాయంగా కొనసాగుతున్న 'సిలికానాంధ్ర' నేతలకి ముందుకి వెళ్ళడం ఒక్కటే మార్గం..ఐతే రెండు వారాల్లో రెండు గంటల పద్యనాటకాన్ని స్థానిక కళాకారులతో సిలికానాంధ్ర స్థాయికి తగినట్లు రూపొందించాలి..వెంటనే మరి కొన్ని ఫోన్లు.. ఇంకొన్ని సంభాషణలు..టెక్సస్ లో వున్న శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ గారు అగస్ట్ 7 న ఏర్పాటు చేయబడిన కార్యక్రమంలో శ్రీకృష్ణ రాయబారం ఏకపాత్రాభినయం ఒక్కటే ప్రదర్శించవలసి వుంది.

" గోపాల కృష్ణ గారూ..మీరు వెంటనే బయలుదేరి రండి..ఇక్కడ కొంతమంది స్థానిక నటీ నటుల్ని సిద్ధం చేసి ఉంచుతాం..మీ శిక్షణలో శ్రీకృష్ణ రాయబారం పూర్తి నిడివి నాటకాన్ని రెండున్నర గంటలపాటు ప్రదర్శించడానికి సిద్ధమౌదాం.." అన్నారు ఆనంద్. "ఏమిటి ఆనంద్ గారూ..శ్రీ కృష్ణ రాయబారం..పూర్తి నాటకం..రెండు వారాల్లో నేర్చాలి..అందునా పద్యనాటకంతో పరిచయం లేని వాళ్ళకి..సాధ్యమేనంటారా..?" సహజంగానే ప్రశ్నించారు గోపాలకృష్ణగారు. "మీరు శ్రీకృష్ణుడుగా వేస్తున్నారు..మిగతావి నాకు వొదిలేయండి.." ఆనంద్ హామీ.. వెంటవెంటనే సిలికానాంధ్ర లో ఇదివరకు నటించిన వార్నీ, నటించకపోయినా ఆసక్తి వున్న వారినీ సంప్రదించడం, అదే రాత్రి ఆనంద్ గారింట్లో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. దాదాపు 20 మంది అంకితభావం కల సిలికానాంధ్ర నటులు వచ్చారు. పద్యనాటకం అనగానే వెనక్కి తగ్గాల్సింది పోయి అందరూ ఉత్సాహంగా 'మేమంటే మేము అంటూ .." ముందుకి వచ్చారు. గుమ్మడి గోపాలకృష్ణ గారి వద్దనించీ వచ్చిన వి.సి.డి. చూసి అందరూ తలా ఒక పాత్ర నిర్ణయించుకున్నారు. ఎవ్వరికీ నేర్చుకోడానికి రెండే వారాలుందన్న భయం, సంశయం కలగలేదు సరికదా , ఎలాగైనా సరే రెండు వారాల్లో నేర్చుకుని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలన్న కసి పెరిగింది. వారాంతంలో అందరూ పోర్షన్లు కంఠతా పట్టారు.

సోమవారం జులై 26 న సిలికాన్ వేలీ కి రావాల్సిన గోపాలకృష్ణ గారు కారణాంతరాల వల్ల 27 రాత్రికి వచ్చారు. 28 నుంచీ నిజమైన రిహార్సల్స్ మొదలయ్యాయి..పట్టుమని పదిరోజులుంది

అంతే..! క్రిందటి వారం 'నమస్తే ప్లాజా' షాపు వద్ద కరపత్రాలు పంచుతుంటే పరిచయమైన శ్రీమతి సత్యప్రియ గారు 'ద్రౌపది' వేషం వేస్తానని ముందుకి వచ్చారు. కర్ణుడిగా నటించడానికి హైదరాబాదు వాస్తవ్యులు ఆటా సందర్భంగా అమెరికా వచ్చిన శ్రీ గంజి సత్యనారాయణ గారు అంగీకరించారు. మరొక కీలక పాత్ర దుర్యోధనుడిగా హైదరాబాదులో వున్న శ్రీ జి.ఎస్.ఎన్. శాస్త్రి గారిని సంప్రదించడం, వారికి పదేళ్ళ వీసా ఉండడం వల్ల, వారు వస్తాననడం జరిగింది. అంచేత శ్రీకృష్ణుడుగా గుమ్మడి గోపాలకృష్ణ, కర్ణుడిగా సత్యనారాయణ, దుర్యోధనుడిగా అగస్ట్ 2 న వస్తానని వాగ్దానం చేసిన శాస్త్రిగారు, మినహా మిగిలిన 14 పాత్రలకీ స్థానిక నటీనటులు ఖాయమయ్యారు. అందరూ రోజంతా వుద్యోగం చేసే వాళ్ళే. రాత్రి ఆఫీసునించీ సరాసరి - ఆనంద్ ఇంటికి రావడం, రాత్రి ఒంటిగంట వరకూ రిహార్సల్ చేయడం..

"మీ పట్టుదల ఉత్సాహం, శ్రమ చూసిన మొదటి రోజునే ఈ కార్యక్రమ ఎలా వస్తుందో ఊహించగలిగాను. లేకుంటే దాదాపు ఆరు నెలల ప్రాక్టీసు లేనిదే రంగస్థలం ఎక్కడానికి అనుమతించని నేను మీతో ఒక్క రోజు పనిచేయగానే ధీమాగా వున్నాను" అన్నారు తరువాత మాట్లాడుతూ గుమ్మడి గోపాలకృష్ణగారు. సత్యనారాయణ గారుకూడా వచ్చారు మర్నాడు. ప్రాక్టీసు ముమ్మరంగా సాగుతోంది, సరే, మరి పౌరాణిక నాటకం అంటే సెట్టింగ్ లు ఉండాలి, పాత్రధారులందరికీ సరైన దుస్తులూ, ఆభరణాలూ, కిరీటాలూ వగైరా కావాలి..దేనికీ వెనకడుగు వేసే సమయం కాదు..స్థానికంగా వున్న బాలావిహార్ వద్దనుంచీ రెండు మూడు కిరీటాలూ, కొన్ని నగలూ అద్దెకి మాట్లాడారు. మీసాలూ, గడ్డాలూ హైదరాబాదునుంచీ తెప్పించే బాధ్యతని దిలీప్ భుజాలమీద వేసుకున్నారు. సింహాసనాలు, , హంస తూలికా తల్పం తయారు చేయడానికి హోం డిపో నుంచీ చెక్కలు తీసుకొచ్చి బొమ్మల్లో చూసి డిజైన్ గీసుకుని కావల్సిన విధంగా కార్డు బోర్డుని కొయ్యడం మొదలుపెట్టారు కొంతమంది కార్యకర్తలు. అటు రిహార్సల్స్, ఇటు వడ్రంగం పనులూ, మరో



వైపు ప్రచారం, టిక్కెట్ల అమ్మకం.. దిలీప్ బృందం 'బాబోయ్ బామ్మ-బుజ్జిగాడి పెళ్ళి' హాస్యనాటిక ప్రాక్టీస్ చేస్తున్నారు..అంతా హడావిడిగా వుంది. రోజు రోజుకీ నటీనటుల్లో ఆ-త్మవిశ్వాసం పెరుగుతోంది. గుమ్మడి గోపాలకృష్ణగారు ఒక్కొక్కరికే పాత్ర స్వరూపస్వభావాల్ని వివరిస్తూ అత్యంత ఓర్పుతో శిక్షణ నిస్తున్నారు.

అంతా ఫరవాలేదు అనుకుంటుండగానే అగస్ట్ 1 న ఇండియా నుంచీ శ్రీ శాస్త్రి గారు రావడంలేదని కబురు.. దుర్యోధనుడి లాంటి కీలకమైన పాత్రకి ఎవరిని ఎంపిక చేయాలి.. కేవలం ఐదు రోజులు మాత్రమే వుంది ప్రదర్శనకి.!! అర్జున పాత్రధారి కూచిభొట్ల రవీంద్ర గారిని దుర్యోధనుడి పాత్ర వేయమని అభ్యర్థించి అప్పుడే శెలవు మీద ఇండియా వెళ్ళి తిరిగి వచ్చిన



డాక్టర్ రవి శంకర్ ని అర్జునుడిగా ఎంపికచేశారు. రవీంద్ర గారికి, కర్ణాటక రాష్ట్రంలో పెరగడం వలన , తెలుగు చదవడం రాదు. పోర్షన్ అంతా (పద్యాలు కూడా) ఇంగ్లీషులో రాసుకుని ప్రాక్టీస్ చేసే వారు. గండం అలా గట్టెక్కింది. అగస్ట్ 5 న న్యూజెర్సీ నుంచీ శ్రీ కందాళం చారి గారు కీబోర్డ్ మీద హార్మోనియం వాయించడానికి వచ్చారు. నటీ నటులంతా దాదాపు 115 పద్యాలనీ చారి గారి తో కూర్చుని హార్మోనియం తో శ్రుతి కలిసేలా ప్రాక్టీస్ చేశారు. రోజులు ఇట్టే తిరిగి పోయాయి..



శుక్రవారం రాత్రి అందరూ వెళ్ళి ప్రదర్శనా హాలు వద్ద సెట్టింగ్‌లూ, బ్యాక్ డ్రాప్ లు సర్దారు. కౌరవ సభకోసం నిలువెత్తు స్థంభాలని అద్దెకి తెచ్చి వాటికి బంగారు రంగు స్ప్రే పెయింట్ వేశారు. పాండవులు అడవిలో వున్నప్పుడు శ్రీకృష్ణుడు వెళ్ళే దృశ్యంలో వెనుక పున్నమి చంద్రుడు రావడం కోసం థియేటర్ వాళ్ళతో మాట్లాడి స్పెషల్ ప్రొజెక్షన్ ఏర్పాటు చేశారు. మొత్తం ఈ ఏర్పాట్లని చేసేందుకి ముగ్గురు ప్రొడక్షన్ మేనేజర్లు ప్రతిరోజూ రిహార్సల్స్ చూసి ఏ కదలికకి ఏ లైటింగ్ రావాలీ, ఎక్కడ మైకులు వుండాలీ అన్నీ వ్రాసుకుని థియేటర్ వాళ్ళకి అర్థమయ్యేలా వ్రాసి ఇచ్చారు.

ప్రదర్శన సమయం రానే వచ్చింది. శనివారం అగస్ట్ 7 సాయంకాలం 5.00 గంటలు..హేవార్డ్ నగరంలోని షాబో కాలేజీ ఆడిటోరియం..సిలికానాంధ్ర క్రమశిక్షణ తెలిసిన ప్రేక్షకమహాశయులు సరిగ్గా ఐదు గంటలకల్లా థియేటర్ లో వున్నారు. కొద్దిసేపటికే ప్రేక్షకుల సంఖ్య వెయ్యికి చేరింది.ప్రార్థన తరువాత ఐ.ఐ.టి(చుక్కా) రామయ్య గారి ఆత్మీయ ప్రసంగంతో కార్యక్రమం మొదలైంది. అహూతులను తమ చక్కటి విశ్లేషణాత్మకమైన ప్రసంగంతో రామయ్య గారు - ఆలోచింపచేశారు. తరువాత ‘బాబోయ్ బామ్మ - బుజ్జిగాడి పెళ్ళి’ హాస్యనాటిక 45 నిమిషాలపాటు ప్రేక్షకుల్ని ముఖ్యంగా పిల్లల్నీ కడుపుబ్బ నవ్వించింది. మామూలు సాంఘిక హాస్యనాటికకే కోయగూడెం, గుడిసె, పెళ్ళి మండపం లాంటి అద్భుతమైన సెట్టింగులు వేసి తమ ప్రత్యేకతని నిరూపించుకున్నారు సిలికానాంధ్ర కార్యకర్తలు.

అందరూ ఉత్కంఠతతో ఎదురు చూస్తున్న శ్రీకృష్ణరాయబారం , అమెరికాలో మొట్టమొదటి సారిగా ప్రదర్శితమౌతున్న పూర్తి నిడివి పద్యనాటకం, సరిగ్గా 7.30 కి మొదలైంది.. ‘పరబ్రహ్మ..పరమేశ్వర..’ ప్రార్థన, పిదప సూత్రధారుని వివరణ..తరువాత హాలంతా చిమ్మచీకటి..రంగస్థలం మీద తెర తొలగినా లైట్లు వెలగలేదు.. నెమ్మదిగా మొదలైన ‘కస్తూరి తిలకం..’ శ్లోకం ఆడిటోరియంలో ప్రతిధ్వనిస్తుండగా స్టేజ్ కి ముందున్న హైడ్రాలిక్ ప్రెషర్ తో

కదిలే ముందు భాగం నెమ్మది నెమ్మదిగా పైకి లేస్తుంటే శ్రీకృష్ణుడు తనదైన ప్రత్యేక భంగిమలో, చుట్టుముట్టిన పొగమేఘాల మధ్యనుంచీ ప్రత్యక్షమవడం..ప్రేక్షకుల నుంచీ కరతాళ ధ్వనులహోరు..! మొదటి దృశ్యం..కృష్ణుడి వద్దకి దుర్యోధనుడు, అర్జునుడు సహాయం కోసం రావడం..'బావా ఎప్పుడు వచ్చితీవు..', 'ఆయుధమున్ పట్టడట..' లాంటి పద్యాలకి 'వన్స్ మోర్..' లు ఈలలు..ప్రేక్షకులు నాటకంలో పూర్తిగా లీనమై పోయారు. తరువాత రెండవ దృశ్యానికి తెరలేచే సరికి పాండవులు అడవిలో ఉండే దృశ్యం..వెనుకాల నిండు పున్నమి చంద్రుడు..రంగస్థలం అంతా నీలిరంగు కాంతి..మరో సారి చప్పట్లు. ఘట్టం వేగం అందుకుంది..భీమసేనుడు, ధర్మరాజు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, ద్రౌపది..పద్యం తరువాత పద్యం.. చారి గారి



హార్మోనియం హాలంతటినీ మన చిన్నప్పుడు ముక్కోటికో, తిరుణాలకో పల్లెటూళ్ళలో నాటకం చూసే అనుభవాన్ని జ్ఞప్తికి తెచ్చింది. ద్రౌపది ఒక ఘట్టంలో శ్రీకృష్ణుడికి తన మనసులో బాధని వివరిస్తూ పద్యం చదవి భోరుమని ఏడుస్తుంటే ప్రేక్షకులు ఆమె నటనకి జోహార్లు చెప్పారు. కానీ పాత్రలో లీనమైన శ్రీమతి సత్యప్రియ సీన్ లో నిజంగానే ఏడ్చారన్న విషయం నేను స్టేజి వెనక్కి వెళ్ళే వరకూ తెలీదు. అభినందనలు చెప్దామని దగ్గరకు వెళ్తే ప్రియ ఇంకా ఏడుస్తోంది..'ఎంత బాగా చేశారండీ..' అంటుంటే 'సారీ ..నేను చాలా ఎమోషనల్ ఐపోయాను..ఇంకా ఏడుపు గడం లేదు.. ఆడదానికి అప్పటి నుంచీ అన్యాయమే జరుగుతోంది..' అంటూ వెక్కి ళ్ళు పెట్టుకున్నారు.. హాట్సాఫ్ సత్యప్రియ గారు..! ఆమెకిది మొట్టమొదటి రంగస్థల అనుభవం అనికూడా ఎవ్వరికీ తెలీదు..

చివరి దృశ్యం..శ్రీకృష్ణుడు చిట్ట చివరిగా నచ్చ జెప్పడానికి కౌరవ సభకి వచ్చాడు.. ధృతరాష్ట్రుడు, గాంధారి కొలువుతీరిన సభలో దుర్యోధనుడ్ని కర్ణుడు రెచ్చ గొట్టడం. అశ్వత్థామ కర్ణుడ్ని ఎదిరించడం, వికర్ణుడు కర్ణుడ్ని సమర్థించడం, భీష్మ, ద్రోణ, విదురులు నచ్చ జెప్పబోవడం..నాటకం క్లైమాక్స్‌కి వచ్చింది..'చెల్లియో చెల్లకో..', 'జెండాపై కపిరాజు..' గోపాలకృష్ణగారి గంధర్వ గానానికి చప్పట్లు, ఈలలు, కేకలు, వన్స్‌మోర్ లు..హాలంతా మారుమోగి పోయింది..! చివరిలో శ్రీకృష్ణుడు విశ్వరూపం చూపినప్పుడు అక్కడికక్కడే భారీ ఎత్తున అగుపించిన కృష్ణుడుని చూసి ప్రేక్షకులు లేచి నిల్చుని హర్షాతిరేకంతో అభినందనలు తెలియచేశారు..రెండున్నర గంటల పాటు..ఎక్కడా చిన్న తడాబాటు కానీ, ఆగిపోవడం కానీ జరగకుండా పాత్రధారులంతా నిజంగా పాత్రల్లో జీవించి సిలికానాంధ్ర విజయవంతమైన ప్రయోగాల పుట్టినిల్లు అని మరోసారి నిరూపించారు. రాత్రి 10.00 గంటలకి కూడా అనేక

మంది ప్రేక్షకులు కూర్చుని గోపాలకృష్ణగారి సన్మానాన్ని, ఆయన ప్రసంగాన్నీ , ఆనంద్ గారు వివరించిన తెరవెనుక కధల్ని శ్రద్ధగా విన్నారు...!

ప్రతికార్యక్రమానికీ తను పెంచుకునే ప్రమాణాలను తానే అధిగమిస్తున్న సిలికానాంధ్ర, ఎప్పటిలాగే కార్యక్రమం ముగిసిన 24 గంటలలోగానే తమ వెబ్ సైట్ లో సచిత్రకధనాల్నీ, వీడియోలనీ వుంచి ప్రపంచానికి తమ కృషిని తెలియచేసింది. ఆంధ్రదేశంలోని వార్తాపత్రికలన్నీ ఈ నాటకం గురించి ప్రత్యేక కధనాల్ని ప్రచురించాయి.

**************************